క్లుప్తంగా

108 అంబులెన్స్‌లో ప్రసవం



బిడ్డకు వైద్య సేవలు అందిస్తున్న 108 సిబ్బంది

అంబాజీపేట: పురుటి నొప్పులతో బాధ పడుతున్న ఒక గర్భిణికి అంబులెన్స్‌లో ప్రసవం జరిగింది. ఇసుకపూడికి చెందిన తెన్నేటి మరియమ్మకు పురుటి నొప్పులు రావటంతో 108కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది ఆమెను పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గ మధ్యంలో పురుటి నొప్పులు ఎక్కువ కావటంతో అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగి, పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ వి.శివప్రసాద్, పైలట్ డీవీ రావులు తల్లీబిడ్డలను సీహెచ్‌సీకి తరలించారు. తల్లీ బిడ్డ సురక్షితంగా ఉన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ పనుల పరిశీలన


400 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

అయినవిల్లి: స్థానికంగా 400 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ గురువారం పరిశీలించారు. తొలుత రైతు నాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సబ్ స్టేషన్ నిర్మాణ పనులతో రైతులకు ఇబ్బంది రాకుండా తగు చర్యలు తీసుకోవాలని సబ్ స్టేషన్ ఇన్‌చార్జ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పుల్లయ్యకు ఆర్డీఓ వివరించారు. అనంతరం 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తెలిపారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు, విద్యుత్ సబ్ స్టేషన్‌కు నిర్మాణ పనుల నిమిత్తం భారీ వాహనాలు వచ్చే విధంగా సమీపంలో పంట కాలువపై వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. సబ్ స్టేషన్ నిర్మాణంతో భారీ పరిశ్రమలు వస్తాయని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన్న పథకానికి భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయని ఆలయ ఈఓ బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన కల్లూరి వెంకట రామానరసింహమూర్తి, సరస్వతి రూ.10,116, బెంగళూరుకు చెందిన గోళ్లమూడి మధుసూదనరావు, రాజకుమారి రూ.10,116 విరాళంగా సమర్పించారన్నారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందజేశారు.

ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి

అయినవిల్లి: తనను ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అధికారులు ఆహ్వానించడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. తనను కనీసం ఎంపీపీగా గుర్తించడం లేదని, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఆఖరి నిమిషంలో ఆహ్వానించి అవమాన పరుస్తున్నారని ఆమె కలెక్టర్‌కు వివరించారు. అంతే కాకుండా ఇటీవల జరిగిన దీపం పథకం-2 కార్యక్రమానికి ఆహ్వానించ లేదని తెలిపారు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరయ్యారని, మరికొందరు ప్రజా సమస్యలు, ప్రజాప్రతినిధులు అడిగే సమస్యలకు సరైన సమాధానం ఇవ్వకుండా దాట వేశారన్నారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేశారు.

కార్తిక దామోదర వ్రతం

అయినవిల్లి: స్థానిక సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ ఆధ్వర్యంలో గురువారం కార్తిక దామోదర వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాసాదాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు చేశారు. అలాగే గోపూజా మహోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలను తిలకించారు.

సమస్యను మురుగుబెట్టి!


మోరిలో అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలో మూసుకుపోయిన మురుగు కాలువ

సఖినేటిపల్లి: మోరి-2 సెక్టార్ పరిధి 167 నంబర్ అంగన్‌వాడీ కేంద్ర భవనం గోడ వరకూ మురుగునీరు వచ్చేస్తోంది. సమీపంలోని కాలువ మూసుకుపోవడంతో వచ్చిన సమస్య ఇది. ఈ కాలువ సమీప స్థలంలో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. కాలువ వైపున భవనానికి రక్షణగా ప్రహరీ నిర్మిస్తే సమస్య తీరుతుంది. అయినా ఇప్పటికీ అధికారులు ఎందుకో నాన్చుతున్నారు.

జలధారేదీ?


కేశవదాసుపాలెంలో నిరుపయోగంగా ఓఎన్జీసీ స్వచ్ఛ జలధార ప్రాజెక్ట్ ట్యాంకు

సఖినేటిపల్లి: సీఎస్ఆర్ నిధుల ద్వారా స్వచ్ఛ జలధార ప్రాజెక్ట్‌లో భాగంగా కేశవదాసు పాలెం, అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో రాజమండ్రి ఓఎన్జీసీ సంస్థ (అసెట్) మినరల్ వాటర్ ట్యాంకులను ఎనిమిదేళ్ల కిందట ఏర్పాటు చేసింది. బోరు వేసి, ఉప్పునీటిని మంచినీటిగా మార్చి ప్రజలకు అందిస్తామని సంస్థ తెలిపింది. దీనికి విద్యుత్ పనుల బాధ్యతను ఆయా పంచాయతీలకు అప్పగించింది. పంచాయతీలు సదరు పనులు చేయక, ప్రాజెక్ట్ మూలన పడింది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీషను వివరణ కోరగా అప్పట్లో తమ శాఖకు ఈ ప్రాజెక్టను అప్పగించలేదని అన్నారు.

దారిలోకి తేవాలి


శృంగవరప్పాడులో అధ్వానంగా మారిన రహదారి

సఖినేటిపల్లి: శృంగవరప్పాడు శివారు రాజీవ్ కాలనీ సమీపంలో వైఎస్సార్ విగ్రహం నుంచి కొల్లాబత్తుల వెంకటేశ్వర్లు ఇంటి వరకూ ఉన్న రహదారి అధ్వానంగా మారింది. ఇక్కడి రెండో వార్డులో సుమారు 800 మీటర్ల రహదారిని ఆనుకుని పలు ఇళ్లు ఉన్నాయి. ప్రజల రాకపోకలకు, వరి, కొబ్బరి రైతులు తమ ఉత్పత్తులను తరలించుకునేందుకు ఇదే ఆధారం. అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లకు గంతలు వీడి ఈ దారిని బాగు చేయాలని అంతా కోరుతున్నారు.

వేతన వేదన

- 104 ఉద్యోగుల ఆందోళన బాట
- వేతన బకాయిల కోసం డిమాండ్
- 14 రోజుల నిరసనకు పిలుపు

మామిడికుదురు: ఊరుని రోగాలు చుట్టేసినా, ఓ వీధి అంతా జ్వరాలతో వణికినా, అందరికీ వైద్యం చేరువ కావాలన్నా 104 వాహనం ఆపద్బాంధవిలా నిలిచింది. అలాంటి వాహన సిబ్బందికి వేతనాలు అందక వేదనే మిగులుతోంది.. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ జీవితాలకు ఎంతో కష్టమొచ్చింది. అసలే అంతంత మాత్రం జీతాలతో నెట్టుకొస్తున్న వారికి అందించే సొమ్ము సక్రమంగా ఇవ్వక ఆందోళన బాట పట్టాల్సి వచ్చింది. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలో 11 మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 104 సర్వీసుల్లో 26 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో మండలంలో రెండు 104 వాహనాల చొప్పున 11 మండలాల్లో 22 వాహనాల ద్వారా వైద్య ఆరోగ్య శాఖ సేవల్లో ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఒక్కో వాహనంలో ఒక డీఈఓ, ఒక డ్రైవర్ విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం నలుగురు రిలీవర్లుగా పని చేస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ఎనిమిది వాహనాలు, పి.గన్నవరం నియోజకవర్గంలో ఎనిమిది వాహనాలు, రాజోలు నియోజకవర్గంలో ఆరు వాహనాలు ఉన్నాయి. వీరందరికీ జీతాలు అందక ఇబ్బంది పడుతున్నారు. వేతన బకాయిలతో పాటు ఇతర డిమాండ్ల పరిష్కారం కోరుతూ 14 రోజుల నిరసనకు వారంతా పిలుపునిచ్చారు. ఈ మొబైల్ వాహనం ద్వారా ప్రతి రోజూ ప్రజల వద్దకు వెళ్లి


ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న 104 ఉద్యోగులు

పీహెచ్‌సీ ఉద్యోగులతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులతో కలసి వైద్య సేవలందిస్తున్న ఈ సిబ్బంది పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఆ వాహనంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న డీఈఓతో పాటు వాహన డ్రైవర్లకు మూడు నెలల నుంచి జీతాలు చెల్లించని దుస్థితి నెలకొంది. దీంతో పాటు ఈ సర్వీసులకు గత ప్రభుత్వం తరహాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారానే నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించి జీఓ నంబర్-7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. వీటితో పాటు మరికొన్ని డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్నో పర్యాయాలు చెప్పాం


మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యలను ఎన్నో పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. అయినా ఫలితం లేదు. దీనిపై పాలకులు, అధికారులు తక్షణం స్పందించి మాకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలి. మా సమస్యలను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలి.

–చొల్లంగి సూర్యవెంకట సత్యనారాయణ, డీఈఓ, నగరం పీహెచ్‌సీ

మేము ఎలా బతకాలి?


అంతంత మాత్రపు వేతనాలతో జీవనం సాగిస్తున్నాం. అయినా దానిని సక్రమంగా ఇవ్వడం లేదు. మేము ఎలా బతకాలి. మా పరిస్థితి పాలకులకు పట్టడం లేదు. మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వక పోవడంతో అప్పులు చేసి జీవనం సాగిస్తున్నాం. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణం స్పందించి వేతనాలు ఇప్పించండి.

–మల్లవరపు జగజ్జీవనరావు, డ్రైవర్, నగరం పీహెచ్‌సీ

పరిస్థితి అర్థం కావడం లేదు


ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న మా పరిస్థితి ఏంటో మాకే అర్థం కావడం లేదు. వేతనాలు ఇవ్వడం లేదు. మా సమస్యలు పరిష్కరించడం లేదు. ఇచ్చేది అరకొర వేతనం. అది కూడా సక్రమంగా ఇవ్వరు. మార్కెట్లో రేట్లు చూస్తే భయమేస్తుంది. చిన్న తరగతి ఉద్యోగులు ఎలా బతకాల్లో ఎవరూ ఆలోచించకపోవడం దారుణం.

–ఎం.అనంతలక్ష్మి, డీఈఓ, లూటుకుర్రు పీహెచ్‌సీ

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


భావన

సఖినేటిపల్లి: ఏలూరులో రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని చెల్లుబోయిన భావన అండర్-14 బాలికల హైజంప్‌లో ద్వితీయ స్థానం సాధించినట్టు హెచ్ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణ గురువారం తెలిపారు. ఈ మేరకు సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ జార్ఖాండ్ రాష్ట్రంలోని రాంచిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో భావన పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్ అన్నారు. ప్రజాప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీ, విద్యా కమిటీ, విద్యాశాఖాధికారులు భావనకు అభినందనలు తెలిపారు.

ప్రత్యేక ఆధార్ శిబిరం

మామిడికుదురు: ఆధార్ కార్డులో సవరణల కోసం మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. రెండు యూనిట్ల ద్వారా ఆధార్ సేవలు అందించారు. ఇంటి పేర్ల మార్పు, అక్షర దోషాలు, తదితర సవరణల కోసం మొత్తం 82 మందికి ఈ శిబిరం ద్వారా సేవలందించారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఇది జరిగింది. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు శిబిరం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ తెలిపారు.

యోగాతో ఆరోగ్య సమస్యలు దూరం


యోగా గురువు ఖేతన్‌ను సన్మానించిన స్థానికులు, ప్రతినిధులు

మామిడికుదురు: యోగాను ప్రపంచ దేశాలకు భారతావని పరిచయం చేసిందని ప్రముఖ యోగా గురువు ఆకుల ఉమామహేశ్వరరావు (ఖేతన్) అన్నారు. మామిడికుదురు యోగా కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఖేతన్ మాట్లాడుతూ బీపీ, షుగర్, గుండె సమస్యలున్న వారు యోగాసనాల ద్వారా ఆరోగ్య సమస్యలను అదుపు చేయవచ్చన్నారు. రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏడిద కవీంద్ర మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కోట బ్రహ్మానందం, మెండా ఆదినారాయణ, నయినాల రఘురామయ్య, మెండా శ్రీను, దొరబాబు, బత్తుల శ్రీనివాస్, శ్రీదేవి, భవాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు: చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ సరఫరా ఉండదన్నారు.

బకాయి వేతనాలు విడుదల చేయాలి


కొత్తపేటలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమలతకు వినతిపత్రం సమర్పిస్తున్న 104 ఉద్యోగులు

కొత్తపేట: తమకు బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని 104 వాహన ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా యూనియన్ అధ్యక్షుడు పలివెల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొత్తపేటలో వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమలతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహిస్తే రూ.50 వేలతో సరిపోతుందని, ఆ మేరకు చర్యలు తీసుకుని ప్రజా ధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్స్, డీఈఓలకు జీఓ నంబర్ 7 ద్వారా వేతనాలు చెల్లించాలని, అరవిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, ఉద్యోగులకు బీమా చేయించాలని డిమాండ్ చేశారు.

క్యాన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం


అంబాజీపేటలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

ఆలమూరు: ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని నివారించడం స్క్రీనింగ్‌తో సాధ్యమని కొత్తపేట డివిజన్ అదనపు డీఎంహెచ్‌ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం జరిగింది. ఆయా పీహెచ్‌సీల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలను వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్ణలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిశోర్ వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ, ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్ పాల్గొన్నారు.

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారి కేజే ప్రశాంత్ ఆధ్వర్యంలో ×క్యాన్సర్‌పై విజయం- స్క్రీనింగ్‌తో సాధ్యం ఆంటూ ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడు ఇంటి వద్దే ఉచితంగా క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలని ఆయన సూచించారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ లభిస్తుందన్నారు. నగరం పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైన ర్యాలీ జాతీయ రహదారి మీదుగా సాగింది. సీహెచ్‌ఓ సత్యవతి, సూపర్‌వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు. పాశర్లపూడిలో జరిగిన ర్యాలీలో హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ ఇందిర, రమ్య పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: స్థానిక పీహెచ్‌సీ నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన ర్యాలీని సీహెచ్‌వో బి.అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారన్నారు.

కేళీ బాధిత రైతులకు నష్టపరిహారం

- ఏడీఏ సమక్షంలో విత్తన కంపెనీ ప్రతినిధులు, రైతుల చర్చ



కొత్తపేటలో కంపెనీ ప్రతినిధులు, రైతులతో చర్చిస్తున్న ఏడీఏ వెంకటరామారావు

కొత్తపేట: వరిలో కేళీల సమస్యపై అధికారులు స్పందించారు. బాధిత రైతులకు తగు న్యాయం చేసే విషయంలో సంబంధిత విత్తన కంపెనీ ప్రతినిధులు ఎట్టకేలకు దిగివచ్చారు. నష్ట పరిహారం చెల్లించేందుకు అంగీకరించారు. మండలంలోని సుమారు 600 ఎకరాల్లో సాగు చేసిన కోమలి 1318 రకం వరిలో వేరే రకం (కేళీ) వచ్చిన సమస్యపై గురువారం సాక్షి దినపత్రికలో కేళీ.. ఇదో రకం మోళీ శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏ ఎం.వెంకట రామా రావు సమక్షంలో యాగంటి ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్ఎం రాజశేఖర్, బాధిత రైతులతో చర్చలు జరిగాయి. 350 ప్యాకెట్లకు (ప్యాకెట్‌కు 20 కేజీలు) మాత్రమే కంప్లెంట్ వచ్చిందని డీలర్ తెలిపారు. సాధారణంగా స్థానిక కూలీలతో నాట్లు వేయడం ద్వారా ఎకరానికి 20 కిలోలు ఉపయోగించగా, బెంగాలీ కూలీలతో నాట్లు వేయించడం ద్వారా ఎకరానికి 10 కిలోలు వినియోగిస్తారు. అలా సుమారు 100 మంది రైతులు ఆ 350 ప్యాకెట్ల (7 వేల కిలోలు) విత్తనాలు ఉపయోగించినట్టు నిర్ధారించారు. చర్చల్లో తాము ప్యాకెట్‌కు రూ.12 వేలు డిమాండ్ చేయగా, కంపెనీ వారు రూ.4 వేలు పరిహారం చెల్లిస్తామన్నారని పలువురు రైతులు తెలిపారు. ఎట్టకేలకు ఏడీఏ మధ్యే మార్గంగా రూ.7 వేలకు ఇరువర్గాలను ఒప్పించారని అన్నారు. బాధిత రైతులు విత్తనాల సంచి, బిల్లు, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ ఎక్కౌంట్ జిరాక్స్ ఇస్తే కంపెనీ ద్వారా పైపరిహారం రైతుల అకౌంట్‌కు జమ చేస్తామన్నారని తెలిపారు. సుమారు 20 రోజుల నుంచి నడుస్తున్న సమస్యకు తెరపడింది. ఈ చర్చల్లో మండల ఎరువులు, పురుగు మందుల డీలర్స్ ప్రెసిడెంట్ చీకట్ల ప్రసాద్, కంపెనీ ఎస్ఓలు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, స్థానిక డీలర్ బొలిశెట్టి చిట్టిబాబు పాల్గొన్నారు.

సోలార్ సిస్టంతో నాణ్యమైన విద్యుత్

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ రాజబాబు


వానపల్లి సదస్సులో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ రాజబాబు

కొత్తపేట: సోలార్ సిస్టం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ పొందవచ్చని ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ ఎస్.రాజబాబు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధి వానపల్లి గ్రామంలో నూరు శాతం సోలరైజేషన్ లక్ష్యంగా గురువారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ రాజబాబు, ఈఈ ఎం.రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ భవిష్యత్‌లో అన్ని విద్యుత్ సర్వీసులను సోలరైజేషన్ సిస్టంలోకి తీసుకురావాలనే లక్ష్యంలో భాగంగా తొలుత వానపల్లిని మోడల్ విలేజ్‌గా, స్వర్ణ గ్రామంగా ఎంపిక చేసినట్టు తెలిపారు. సోలార్ సిస్టంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఒకేసారి ఖర్చు పెట్టి సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్ అంతా వినియోగించుకున్న విద్యుత్‌కు తక్కువ ఖర్చుతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసుకోవచ్చన్నారు. మొదట అయ్యే ఖర్చుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఉదాహరణకు 300 యూనిట్లు విద్యుత్ వినియోగించుకునే ఇంటికి రూ.2 లక్షల ఖర్చు కాగా రూ.75 వేలు రాయితీ, మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణం తీసుకుని, వాయిదాల్లో ఈఎంఐ కట్టుకోవచ్చన్నారు. ఈ స్కీమును గ్రామంలో ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఏడీఈ డి.చిట్టిబాబు, ఏఈ వి.శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, పలువురు పంచాయతీ సభ్యులు, నాయకులు, వీఓఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖబర్‌స్థాన్‌కు స్థలం చూపాలంటూ నిరసన


ఈతకోట పంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

రావులపాలెం: ఖబర్‌స్థాన్‌కు గ్రామ పంచాయతీ స్థలం కేటాయించినట్టు తీర్మానం చేసినా, రెవెన్యూ అధికారులు స్థలాన్ని చూపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఈతకోటకు చెందిన నెక్కంటి కాలనీ ముస్లింలు గురువారం నిరసన తెలిపారు. ఇక్కడి పంచాయతీ వద్ద మహిళ మృతదేహంతో ధర్నా చేశారు. స్థానికులు, మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. ఈతకోట నెక్కంటి కాలనీకి చెందిన షేక్ మీరాభి (90) గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. అయితే ఖబర్‌స్థాన్ స్థలం లేకపోవడంతో కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ముస్లింలు కూడా ఆమె మృతదేహాన్ని పంచాయతీ వద్దకు తీసుకువచ్చి ఆందోళన చేశారు. గ్రామంలోని ఖబర్‌స్థాన్ చుట్టూ నివాస ప్రాంతాలు కావడంతో రెండేళ్ల క్రితం వేరే ప్రాంతంలో ఇస్తామంటూ పంచాయతీ అధికారులు, నాయకులు తమ స్థలాన్ని తీసుకున్నారన్నారు.

కొత్త స్థలాన్ని కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేసినా, రెవెన్యూ అధికారులు స్థలాన్ని నిర్ధారించక పోవడంతో ఎవరైనా చనిపోతుంటే వేరే ఊరికి తీసుకువెళ్లి ఖననం చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఈ విషయం తెలుసుకున్న రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు అక్కడకు చేరుకుని చర్చలు జరిపారు. వారం రోజుల్లో పంచాయతీ తీర్మానం చేసినట్టు ఖబర్‌స్థాన్‌కు రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేస్తారని వివరించడంతో సమస్య పరిష్కారం అయ్యింది. అనంతరం మీరాభి మృతదేహాన్ని రావులపాలెం కబరిస్తాన్‌కు తరలించి ఖననం చేశారు.

ఆత్రేయపురాన్ని దత్తత తీసుకున్న 'గ్లోబల్'


ఎన్ఆర్ఐ డాక్టర్ భూపతిరాజు పెండేటి


ఆత్రేయపురంలో సమావేశమైన పెద్దలు, గ్లోబల్ ఫాండేషన్ సభ్యులు

ఆత్రేయపురం: ఆత్రేయపురం గ్రామాన్ని అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ దత్తత తీసుకుందని ఆ సంస్థ చైర్మన్ భూపతిరాజు పెండేటి అన్నారు. ఇదే గ్రామ వాసి, అమెరికాలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు డాక్టర్ వేగేశ్న చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ వేగేశ్న రామకృష్ణంరాజు సూచన మేరకు వైద్య ఆరోగ్య రంగాల్లో అభివృద్ధి చేయడానికి గురువారం దత్తత తీసుకున్నట్లు తెలిపారు. డాక్టర్ భూపతిరాజు పెండేటి అమెరికాలో ఆర్థికంగా ఉన్నత స్థానానికి చేరుకుని తనవంతు ఇక్కడి ప్రజలకు వైద్య, ఆరోగ్య, పారిశుద్ధ్యం, తాగునీటి తదితరవి మెరుగుపర్చేందుకు దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ గ్లోబల్ ఫౌండేషన్ ఆత్రేయపురం గ్రామాన్ని దత్తత తీసుకున్న సందర్భంగా గురువారం జరిగిన సభలో సంస్థ రాష్ట్ర కన్వీనర్ వన్నె చింతలపూడి గ్రామానికి చెందిన నడింపల్లి వెంకట రామరాజు మాట్లాడారు. అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఆత్రేయపురం గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఫౌండేషన్ ఆత్రేయపురం కన్వీనర్‌గా గాదిరాజు ప్రసాదరాజును ఫౌండేషన్ సభ్యులు ప్రతిపాదించారు.

అయ్యప్పను చూసి.. మది మురిసి


పాశర్లపూడిబాడవలో అయ్యప్ప స్వామి కలశ పూజలో స్వాములు

మామిడికుదురు: స్వామి శరణం.. అయ్యప్ప శరణం ... అంటూ ఆ స్వామి భక్తుల శరణు ఘోష మార్మోగింది. బుధవారం రాత్రి పాశర్లపూడిబాడవలో అయ్యప్ప స్వామికి 18 కలశాల పూజ వైభవంగా జరిగింది. తోరం బాబి స్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజకు భారీ సంఖ్యలో స్వాములు హాజరయ్యారు. తొలుత పేటతుళ్లి ఆడుతూ కలశాలతో భారీ ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి వెళ్లారు. అక్కడి నుంచి కలశాలతో గోదావరి నదీ జలాలు తీసుకు వచ్చి కలశ పూజ నిర్వహించారు. పెదపట్నానికి చెందిన జయంతి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాష్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన అలరించింది.

- పాశర్లపూడిబాడవలో షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, స్వామికి అభిషేకం, అర్చన, నీరాజన మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలను జరిపారు. ఆలయ వ్యవస్థాపకుడు గంధం స్వామినాయుడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రులో అభయ ఆంజనేయ స్వామివారి 27 అడుగుల ఆవిష్కరణ, శిలామయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా రెండో రోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీనివాసుల విజయ్ గోపాలాచార్యులు బ్రహ్మత్వంలో గ్రామస్తులు, భక్తులచే వేద స్వస్తి, పుణ్యాహవాచనం, గో దృష్టి, ఆంజనేయ స్వామి శిలామయ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, యజ్ఞాయన హోమాలు చేపట్టారు. 8న స్వామివారి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.